# దూరపుకొండలు నునుపు

ఆఫీసువర్కు, హెడ్ గుమాస్తా హంగామా, నడుము ఉక్కిరి బిక్కిరియై వేడెక్కిన మెదడుతోను, అలసిన శరీరంతోను ఇల్లు చేరుకున్నాడు గోపాలం. మెట్లెక్కుతూ తటాలున ఆగిపోయాడు. లోపల్నుండి పాటలు, నవ్వులు వినవచ్చాయి. బాబు పాడుతున్నాడు గట్టిగా. 'గోపాలం, తిన్న నాన్న-గోల పత్తి వేశావా-తెమ్మంటె లేవేమి. లేకుంటె నాకేమి' అంటూ చిట్టి భోం! భోం! అంటోంది. గోపాలం పెదవులపై చిరునవ్వు మెరసింది. అతని శరీరపు బడలికంతా ఎటో మాయమై హృదయం ఉల్లాసపూరితమైంది. లోపలికి వెళ్లగానే బాబు నాన్నని చూసి పాట ఆపి సిగ్గుతో బియ్యమేరుతున్న తల్లివొడిలో దాగాడు. బొమ్మలపెళ్లి చేస్తున్న చిట్టి బొమ్మలో మూల పారవేసి నాన్నారూ! అంటూ గోపాలం దగ్గరకొక్క గంతు గెంతింది. 'మీరు రాగానే బాబు చూశారా, పాట మానేసి ఎలా దాక్కున్నాడో,' అంటూ కాంత చిరునవ్వు ముఖంతో లేచి వంటింట్లోకి వెళ్లింది కాఫీ తెచ్చేందుకు.

గోపాలం కాఫీతాగి పడకకుర్చీలో జారబడి కూర్చుంటే చిట్టి, బాబు చేరి ఏవేవో కబుర్లు చెప్పసాగేరు. చిట్టి, మాటి మాటికి సిల్కుగౌను సంగతి జ్ఞాపకం చేయసాగింది తండ్రికి. కాంత రాగానే 'రామం ఉత్తరం వ్రాసేడు. ఈ ఊరు ట్రాన్సఫర్ అయి వస్తున్నాట్ట' అన్నాడు గోపాలం కవరు పైకి తీస్తూ. తరువాత చాలసేపటివరకు ఇరువురూ రామారావు విషయమే మాట్లాడుకున్నారు. రామారావు బి. ఏ. లో గోపాలం క్లాసుమేటు. స్వతహాగా తెలివితేటలు లేకపోయినా కాసుల ప్రభావంవల్ల పరీక్షలు గెలుపొంది పెద్దపెద్ద వాళ్ల సహాకారంవల్లా, లక్ష్మీ ప్రభావంవల్లా అచిరకాలంలోనే గొప్ప ఆఫీసరై కూర్చున్నాడు. మంచి పలుకుబడి, ఆస్తి, ఇళ్లు సంపాదించాడు. ఇక గోపాలం సామాన్య మానవుడు. *Studies* లో ఎంత గొప్ప తెలివితేటలు ప్రదర్శించినా రామంలాగే తానూ పాసయ్యాడు. అతి కష్టం మీద క్లార్కు ఉద్యోగంలో ప్రవేశించి 80 రూ॥ జీతం మీద భార్య, ఇద్దరు పిల్లల తన యొక్క జీవన భారాన్ని మోస్తున్నాడు. జీవితయాత్రలో అడుగడుక్కీ ఎదురయ్యే కష్టాల్ని అవాంతరాల్ని ఎదుర్కోలేక సతమతమవుతూ జీవితంమీద విసిగిపోతూ తన్ను తాను నిందించుకుంటుంటాడు. కాని క్షమాస్వరూపిణి కాంత, అతని నీరస హృదయాన్ని ఉల్లాసపరచే

> ఉన్నదానితోనే సరిపుచ్చుకొని జీవితం గడపాలి. ఎవరో సుఖపడిపోతున్నారనీ మనకు లేదనీ చింతిస్తుంటే జీవితం ఎలాగడుస్తుంది ?

చంద్రికాజ్యోతి. అతని చీకటిహృదయాన్ని ప్రకాశింపజేసే ఆశాకిరణాలు చిట్టీ బాబులు. రాత్రి పదకొండు గంటలకి మెలకువ వచ్చి కాంత లేచేసరికి గోపాలం ఇంకా మేలుకొనేఉండి ఏదో ఆలోచిస్తూ కూర్చునున్నాడు. దగ్గరకెళ్లి 'ఏమిటి అలా కూర్చున్నారు? నిద్రపోలేదా? అని అడిగింది. గోపాలం మాట్లాడలేదు. కాంత మళ్లా 'ఏమిటి ఆలోచిస్తున్నారు?' అని అడిగింది. గోపాలం నిట్టూర్పు విడిచి ఏముంది. రాము ఎంత అదృష్టవంతుడు. ఎవరికోగాని అలాంటి సుఖజీవితం రాదు. జీవితంలో కావలసినవన్నీ వాడికి లభించాయి రాములాంటివాళ్లకి బియ్యం కుంచం ఎన్ని రూపాయలయినా లెక్క లేదు. బట్టలెంత ఖరీదయినా భయం లేదు. జీవితమంటే అలాంటివాళ్లదే. నేనూ వాళ్ళలా జీవించిఉన్నవాణ్ణే. రేపు జీతం అందుతుంది. ఇంటివాడికి, పాలవానికి, చాకలికి, షావుకారుకి బియ్యానికిపోను మిగిలే దేముంది? చిట్టికి సిల్కుగౌను కూడ కొనలేని నాకూ పిల్లలూ, సంసారం. అబ్బా! అని బాధగా మూలిగాడు. అతని హృదయంలో ఏదో సంకుల సమరం జరుగుతున్నట్లుగా వుంది. ఆ హృదయ వేదనంతా ఆతని ముఖంలో ప్రతిఫలమవుతూంది. గోపాలం అన్నమాటలు విని కాంత నిట్టూర్పు విడిచింది. భర్త తలపై చేయిపెట్టి నిమురుతూ 'మీరెందుకలా విచారపడుతుంటారు? చిట్టికి గౌను సిల్కుది లేకపోతే ఏంకొంప మునిగింది? భగవంతుడు మనకిచ్చిందేదో మనకిచ్చాడు. ఉన్నదానితోనే సరిపుచ్చుకొని మన జీవితాలని గడపాలి. ఎవరో సుఖపడిపోతున్నారని మనకు లేదని చింతిస్తూంటే మన జీవితాలు మరింత దుర్భరమవుతాయి. సంతోషం లేశమయినా లేకుండా కృశించిపోతాము. మన కెదురుగా కనపడే మానవులు ధరించే విలువయిన సూట్లవల్లా—ఖరీదయిన చీరలవల్లా, వాళ్లు తిరిగే కార్లవల్లా వాళ్ల విలువల్ని—సంతోషాన్ని మనం కనిపెట్టలేం. వాళ్ల పై వేషాల్ని బట్టి వాళ్లు సంతోషజీవులని అనుకోకూడదు. పైకి ఎంత డాంబికంగా, సంతోషంగా, మోదాలో తిరుగుతూన్నా వాళ్ళ అంతరంగికజీవితం విచారాలతోను, అశాంతితోను నిండిఉంటుంది. నిజానికి ఆలోచిస్తే వాళ్ళకన్న మనలాంటి సామాన్య జీవితాలే ఎన్నో వేలరెట్లు నయం. దూరానికి కొండలు ఎంతో నునుపుగా అందంగా కనపడతాయి. దగ్గరకెళ్లి చూస్తే వాటి నిజస్వరూపం ఎంత భయంకరంగా ఉంటుందో గోచరిస్తుంది.' అంటూంటే

## ప్రేమలీల

శాంత గొంతుక దుఃఖంతో వణకింది. చిట్టి నిద్రలోనుండి లేచి 'అమ్మా' అని పిలిచింది. శాంత చటుక్కున లేచి 'లేవండి. ఇక పడుకోండి. పిచ్చి పిచ్చి ఆలోచనలతో బుర్ర పాడు చేసుకోకండి.' అని చిరునవ్వుముఖంతో అతని ముఖాన్ని తనవైపు తిప్పుకుంది. ఆ మందహాస వదనం అతని ఉన్మత్త హృదయాన్ని ఏ అమృత రస వీథుల్లోకో గొనిపోయింది. రామారావు ఆఊరు వచ్చి వారంరోజు లయినా, గోపాలానికి ఆఫీసుపనివల్లా, రామారావు కీయబడే సన్మానాలు, స్వాగతాల మీటింగుల వల్లా స్నేహితుని కలుసుకొనే అవకాశం కలగలేదు. అప్పుడప్పుడు మీటింగుల్లో కలసికొనినా తీరిగ్గా మాట్లాడేందుకు వీలవలేదు. సొసైటీలో రామారావుకు గల స్థానాన్ని అతనికీయబడే గౌరవాన్ని-అతను కనపరచే హోదాను-తిరిగే కారు వంకా విస్తుపోయి చూచేవాడు గోపాలం. అనుకోకుండానే అతని పెదవులనుండి 'అదృష్టవంతుడు' అనే పదం దానంతటదే దొర్లుకుంటూ వచ్చేది. ఆవేళ సాయంకాలం గోపాలం తీరుబడి చేసుకొని రామారావింటికి బయలుదేరాడు. అతని హృదయమేమీ నెమ్మదిగా లేదు. బాబుకి కొస్త జ్వరం వచ్చింది. అంత వరకూ బాబు దగ్గర కూర్చొని కాస్సేపు స్నేహితునితో గడపాలని బయలుదేరాడు. రామారావు బంగళా సమీపించేసరికి అప్పుడే డాక్టరు గేట్లోనుండి బయటికొచ్చి కారెక్కుతున్నాడు. 'ఎవరికి జబ్బుగా ఉందో' అనుకుంటూ, గోపాలం లోపలికెళ్ళేటప్పటికి ఆఫీసురూంలోనుండి బయటికొస్తున్న రామారావు ఎదురై స్నేహితునితో మళ్ళా లోపలికి వెళ్ళాడు. ఇల్లంతా ఏ ఇరవై పాతికమంది మనుష్యులతోనో నిండి పిల్లల గోలలు ఏడుపులతోను, ఆడవాళ్ళ కేకలతోను నిండి సందడిగా ఉంది. 'అంత గోలల్లో ఆఫీసు పని ఎలా చూస్తున్నాడా' అని ఆశ్చర్యం వేసింది గోపాలానికి. లోపల్నుండి చంటి పిల్ల ఏడుపు గట్టిగా వినిపించింది. గోపాలం రామం వంక తిరిగి 'జబ్బు చేసిందేమిటి రామం ఎవరికయినా? డాక్టరు వచ్చాడు' అన్నాడు. రామారావు నిట్టూర్పువిడిచాడు. 'నీకిది ఈ వేళ క్రొత్తగా ఉంది కాబోలురా గోపి, నాకు మామూలే. మా ఇంటికి డాక్టరు రాని రోజు లేదు. మందు వాడని గంట లేదురా. ఇందిర బొత్తిగా రోగిష్టిదయింది. ప్రతి నెలా ఏ జబ్బో, నీరసమో. ఇహ ఉన్న వాళ్ళంతా తిని పెట్టేవాళ్ళేగాని ఏడుస్తున్న పిల్లల్ని కాస్తయినా చేరదీయరు. అంతా నేనే చూచుకోవాలి అంటూ ఒసే అప్పీ అమ్మాయినిట్లా తీసుకురావే! అన్నాడు...అంతసేపటివరకూ ఇంటి పెంకు లెగిరిపోయేలా గోల పెట్టిన పిల్ల తండ్రి బుజమెక్కగనే ఊరుకుంది ఏడుపు మాని.

అంతలో ఎవరో సూటువాలా వాళ్ళ ముందునుంచే బయటకెళ్ళాడు. రామం అతన్ని చూపిస్తూ 'మా మూడో బావమరిది. వ్యాపారంలో నష్టం కలిగిందంటూ మూడు వేలు రొక్కం తక్షణం సహాయం చేయాలని వచ్చి కూచున్నాడు. దానికోసం ప్రయత్నిస్తున్నాను' అన్నాడు. స్నేహితులిరువురూ అలా మాట్లాడుకొంటూండగనే సందె చీకట్లు నలువైపుల వ్యాపించాయి. గోపాలం స్నేహితుడి దగ్గర సెలవు తీసికొని ఇంటి ముఖం పట్టాడు. అతని హృదయంలో ఏవేవో ఆలోచనలు బయలుదేరాయి. గొప్ప వాళ్ళకి ఎన్ని కష్టాలు, రోగాలు వచ్చినా వాళ్ళు తట్టుకొని నిలుస్తారు. ఆ శక్తి వాళ్ళకుంది. తనలాంటి వాళ్ళకే అలాంటివి వస్తే...? బాబుకి జ్వరంగా ఉంది ఎలా ఉందో అనే ఆదుర్దాతో గోపాలం ఇంటిలో ప్రవేశించాడు. కిల కిలలాడుతూ ఆడుకుంటున్న బాబు, చిట్టీలని చూడగానే 'అమ్మయ్య' అనుకున్నాడు ప్రశాంత హృదయంతో. ఆవేళ ఆదివారం. గోపాలంకి ఆఫీసు పని లేదు. ఆ వేళే చిట్టి పుట్టిన రోజు. శాంత ఏవేవో పిండి వంటలు రెండు మూడు చేసింది. భోజనాలయిన తర్వాత అంతా హాల్లో కూర్చున్నారు. బాబు వింత వింత చేష్టలకి పాటలకి శాంత, గోపాలం విరగబడి నవ్వుతున్నారు చిట్టి నాన్నగారికి డాన్సు చేసి చూపిస్తోంది. అక్క చేస్తోందని బాబు కూడా చేతులు తిప్పుతూ తిరగ సాగాడు. అది చూచి శాంత, గోపాలంలు నవ్వాపుకోలేక విరగబడి నవ్వసాగేరు. ఇంతలో 'గోపాలం అని పిలుస్తూనే రామారావు లోపలికి వచ్చాడు. అతన్ని చూచి శాంత లోపలికి వెళ్ళిపోయింది. చిట్టి, బాబు ఆట మానేసి రామారావు కేసి చూడసాగేరు గోపాలం చిరునవ్వుతో రామారావు నాహ్వానించి కూర్చోబెట్టాడు. చిట్టి రామారావువంక ఒక నిముషం చూచి 'నమస్కారమండి' అని నమస్కారం పెట్టి లోపలికి పారిపోతూంటే బాబు కూడ చేతులు జోడించి 'నమత్కాలం' అని తుర్రున పారిపోయేడు. రామారావు చిరునవ్వుతో వాళ్ళు పోయినదెస చూడసాగేడు. "చాలా సంతోషం రామం, మాయింటికి వచ్చినందుకు" అన్నాడు గోపాలం. రామారావు తన దృష్టి గోపాలంమీదికి మరల్చుకొని 'అరగంటనుండే బయట చాటుగా నించొని మీ సంతోషాన్ని చూస్తున్నానురా. ఇక పట్టలేక వచ్చేశాను. మనస్సంతా చీకాకుగా ఉందని నీతో కాస్సేపు గడుపుదామని వచ్చానురా, నాలోని చీకాకంతా ఏమూలకో ఎగిరిపోయిందిరా గోపీ! నిజంగా నీవెంత అదృష్టవంతుడివి. ఎవరికోగాని ఇలాంటి అదృష్టం దొరకదు దేనికయినా పెట్టిపుట్టాలి' అంటూ నిట్టూర్పు విడిచాడు. అతని హృదయంలో ఏదో పెద్ద కల్లోలం బయలుదేరింది. ముఖం వివర్ణమై పోయింది. గోపాలం రామంవంక తెల్లబోయి చూశాడు. 'అదేమిటి రామం! అలా అంటావు. నీకన్న అదృష్టవంతు డెవరుంటారు? నివె అలాఅంటే మాలాంటి సామాన్యుల గతేమిటి? నీకేం రామం సుఖమయిన, ఏచీకూ చింతా, నిత్యావసరాల బాదరబందీ లేని జీవితం. నేనా అదృష్టవంతుణ్ణి...' అన్నాడు గోపాలం. రామారావు ఇంకా వేడి నిట్టూర్పులు విడుస్తూనే ఉన్నాడు. 'పిచ్చిగోపీ, నీవేదో ఊహిస్తున్నావు, నేనేదో సుఖపడిపోతున్నానని, జీవితంలో ఏ విచారమూ నాకంటదని!' అది వట్టి భ్రమ మాత్రమే. నాది వొట్టి రసహీనమయిన, సంతోషరహితమయిన మొద్దువారిన జీవితం. సంతో

**చేతిపనుల వర్తకరహస్య బోధిని**

50 రూపాయలనుంచి 500 రూపాయల వరకు నెలకు సంపాదించవచ్చును. ఇందు సబ్బు దినుసులు. సెంట్లు. అత్తరు. హేరాయిల్సు. పిప్పరమెంటు. వార్నిస్, వర్ణములు, పన్నీరు. షర్బత్తు ఊదువత్తులు. కర్పూరం, సిరా దినుసులు, గిల్టుయిచ్చే విధము, ఫోటో ఎత్తువిధము, బాణసంచా. మందులు. సులభముగా తయారుచేయు పద్ధతులతో 100 పేజీలు గల పెద్దపుస్తకము. వెల రు 1-8-0, పోస్టు ఖర్చు 6 అణాలు. మహారాజ పుస్తకశాల, 12, ఆరుణాచల మొదలి వీధి. మద్రాస్.

సుమంటే, హృదయానందమంటే ఏమో ఎరగని మొరటువారిన జీవితం నాది. నాలో మానవత్వమే లేదు. తెరిపిలేని ఆఫీసుగొడవల్లోనూ, రోగిష్టి భార్యతోను, పిల్లల గోలల్లోను, పీల్చుకుతినే బంధువుల్లోను, నా జీవిత దినాలు గడిచిపోతున్నాయి. ఒక్క సంతోషం లేదు ఒక్క ఆనందం లేదు. ఆ గోలల మధ్య ఎలా ఉంటున్నానో నాకే అర్థంకాదు. ఆ నిస్పృహా జీవితానికి అలవాటయిపోయిన యంత్రాన్ని. నీలాంటి,




ప్రతివాళ్లు అనుకుంటారు రామంలాంటి అదృష్టవంతుడు లేడని. నేననుకుంటుంటాను, 'భగవంతుడా! పగవాళ్లకయినా ఇలాంటి జీవితం వొద్దని.' హృదయంలో ఎంత విచారమున్నా పైకిమాత్రం ఆడంబరంగా తిరుగుతుంటుంటాను. లేకపోతే ఈ సొసైటీలో ఎలా తిరగడం? నా హోదాని నా పై వేషాన్ని చూచి నీవేదో ఊహిస్తున్నావ్ గోపీ. నిజమయిన సంతోషాన్ని, సుఖజీవితాన్ని ఈ వేళ నేను ప్రత్యక్షంగా చూచాను, అనుభవించాను.' రామారావు ఊరికే ఆయాసపడుతున్నాడు. గోపాలం అతని వాక్ప్రవాహాన్ని ఏ విధంగానూ నివారించ లేకపోయాడు. 'ఇలాంటి సుఖంకోసం, సంతోషంకోసం శాంతివంతమైన జీవితం కొరకు నా హృదయం ఊరికే తపిస్తూంటుంది. నేనెంతగా దాన్ని కోరుతున్నానో అంతగా ఊపిరి తిరగని రొంపిలో రోజురోజూ కూడిగబడిపోతున్నా. 'బయటంతా ఆడంబరం, అధికారం, హోదా, వ్యవహారాలు. ఇంట్లో రోగాలు, ఏడుపులు, గోలలు. రాబందుల్లా పీల్చుకుతినే బంధువులు. వీటి మధ్య నా జీవితం నలిగిపోతూ మానవత్వాన్నే గోల్పోయిన యంత్రంలా అయిందిరా గోపీ' అని రామం నిస్పృహతో అంటూంటే గోపాలానికి ఒకనాటి రాత్రి తను తన దురదృష్టానికి చింతిస్తూంటే వణికే గొంతుకతో శాంత 'మనుష్యుల పై వేషాల్ని బట్టి ఎప్పుడూ వాళ్ల విలువల్ని-సుఖాల్ని కనిపెట్టలేం. దూరానికి కొండలు నునుపుగా అందంగా కనపడతాయి. దగ్గరికెళ్లి చూస్తే వాటి నిజాకృతి ఎంత భయంకరంగా ఉంటుందో గోచరిస్తుంది' అన్న వాక్యాలు చెవుల్లో మారు మ్రోగసాగేయి మళ్లీ మళ్లీ. ఇంతలో చిట్టి లోపల్నుండి కాఫీ తెచ్చి ఇరువురికీ ఇచ్చింది. రామారావు వలే గోపాలం హృదయంలో కూడ ఏదో మహా కలవరం బయలు దేరింది. రామం కేసి ఊరికే తేరి పార చూడసాగేడు. శాంత అన్న మాటలు పదే పదే అతని చెవుల్లో వినబడసాగేయి.

తన ఇంట్లో ఉన్న స్వర్గాన్ని జీవితంలో ఉన్న సంతోషాన్ని ఈ నాడు తాను అర్థంచేసికో గలుగుతున్నాడు. తన జీవితంలోని శాంతిని-ఆనందాన్ని గుర్తించుకోకుండా ఇన్నాళ్లూ తన దురదృష్టాన్ని గూర్చి చింతిస్తూ ఎవరో సుఖపడి పోతున్నారని, తనకా అదృష్టం లేదని పిచ్చి భ్రమతో హృదయాన్ని అసంతుష్టితో నింపుకొని నిట్టూర్పులు విడిచేవాడు. 'ఇహ వెళ్లొస్తానురా గోపీ! చాలా పనులున్నాయి. ఏరీ, నీ పిల్లలు?' అని రామం లేచాడు. గోపాలం ఊహాప్రపంచంలో నుండి తుళ్లిపడి లేచి 'చిట్టీ!' అని పిలచాడు. పిల్లలిరువురూ రాగానే ఇద్దరినీ ఎత్తుకొని ముద్దు పెట్టుకొని దించాడు రామారావు. 'అరే! గోపీ, వెడతానురా ఇహ' అంటూ సైకిల్ ఎక్కాడు. గోపాలం రామం కనిపించే వరకు అలాగే చూస్తూ నుంచున్నాడు. రామారావు దారిలో ఎవరెవరో పెడుతున్న నమస్కారాలు అందుకుంటూ చిరునవ్వుతో ఆంతరంగిక వేదనని కప్పుకుంటూ పోతున్నాడు. గోపాలానికి స్నేహితుని నిస్పృహామయిన భారమైన జీవితంపై జాలి సానుభూతి కలిగాయి. హృదయానికి సంతోషం కలిగించలేని సంపదలు అధికారాలు, ఆడంబరాలు మరి దేనికి? కర్తవ్యాల నడుమ, బాధ్యతల మధ్య నిర్జీవమైన జీవితాన్ని దొర్లిస్తూన్న నిరాశా జీవి రామారావు. 'ఏమిటి చూస్తున్నారు. మీ, స్నేహితుడు వెళ్లిపోయారా?' అని శాంత గొంతు వినిపించేసరికి గోపాలం జాగ్రదవస్థలోకి వచ్చి వెనుదిరిగి చూసేడు. చిరునవ్వుతో శాంత అతనివంక చూస్తూ నుంచుంది. ఆ అరుణ కాంతిలో ఆమె వదనం ఎంత సౌందర్యాన్ని విరజిమ్ముతూంది. గోపాలం ఆమె కళ్ళల్లోకి చూస్తూ 'శాంతా! ఆనాడు అన్నావు చూశావా! 'దూరానికి కొండలు నునుపుగానే ఉంటాయి, దగ్గరి కెళ్లితే వాటి నిజస్వరూపం బయల్పడుతుందని.' ఆ వాక్యంయొక్క నగ్నసత్యాన్ని ఈనాడు రామం జీవితంవల్ల గ్రహించాను. నిజమయిన సంతోషం, ఆనందం, సుఖాన్ని-అవి ఎలా వస్తాయో ఈనాడు గ్రహించాను. అర్థంచేసికొన్నాను. 'నా మార్గజ్యోతివి నీవు' అంటూంటే, చిట్టి, బాబు అమ్మా! అంటూ పరుగెత్తుకొని వచ్చారు. శాంత, గోపాలంలు వాళ్లవైపు చూచేరు. వాళ్ళ పసిచేతుల్లో చెరో పదిరూపాయిల నోటూ ఉంది. 'అమ్మా! ఇందాక వచ్చి నాయన ఇచ్చారే మేము సినిమాపేపరు కోసం వెళుతూంటే' అంది చిట్టి. శాంతా గోపాలంలు అప్రయత్నంగా ఒకరి మొహం మరొకరు చూచుకొన్నారు.

ఆ సందెచీకట్లో తులసికోట దగ్గర శాంత ఉంచిన దీపం దివ్యంగా ప్రకాశిస్తూ వింత కాంతుల్ని చిమ్ముతూంది. ★